సాక్షి
నిర్మల్
గురువారం । 5 । జనవరి । 2023



నాగోబాను స్మరిస్తూ.. పవిత్ర గంగాజలాలకు

నెలవంక దర్శనంతో మెస్రం వంశీయులు నాగోబా జాతరకు శ్రీకారం చుట్టారు. ఆరాధ్య దైవాన్ని కొలిచేందుకు సిద్ధమయ్యారు.

8లో▸



బాసరలో కొనసాగుతున్న ఆందోళనలు

సరస్వతీ అమ్మవారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆందోళనలు కొనసాగుతున్నాయి. బాసరలో విద్యార్థులు ఆలయం వరకు నిరసన ర్యాలీ తీశారు.

8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0 / 18.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. గాలిలో తేమ పెరుగుతుంది. చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది.

సీఎంఆర్ 23 శాతమే!



2021-22 రబీ సీఎంఆర్ వివరాలు

మిల్లర్లకు కేటాయించిన ధాన్యం	90,776.640 మెట్రిక్ టన్నులు
మిల్లరు అప్పగించాల్సిన బియ్యం	66,593.620 మెట్రిక్ టన్నులు
ఇప్పటివరకు అప్పగించింది	15,480.420 మెట్రిక్ టన్నులు
ఇంకా అప్పగించాల్సింది	51,113.200 మెట్రిక్ టన్నులు

- పూర్తి కాని యాసంగి మిల్లింగ్
- ఈ నెలాఖరుతో గడువు పూర్తి
- వందశాతం కావడం గగనమే..
- కేటాయించిన ధాన్యం పక్కదారి!
- పట్టించుకోని సివిల్ సప్లయ్‌శాఖ

భైంసాటౌన్: జిల్లాలో సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. గత యాసంగికి సంబంధించి మిల్లర్లకు కేటాయించిన ధాన్యం మిల్లింగ్ ఇప్పటికీ పూర్తికాలేదు. ధాన్యం అప్పగించిన ఆరునెలల్లో మిల్లర్లు బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉండగా, జిల్లాలో ఇప్పటివరకు ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. మరోవైపు ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావస్తుండగా, గత రబీకి సంబంధించి సీఎంఆర్‌లో పురోగతి కనిపించడం లేదు. కొందరు మిల్లర్లు ప్రభుత్వం కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టించేందుకు మిల్లింగ్‌లో జా ప్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పట్టించుకోవాల్సిన సివిల్ సప్లయ్ అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

గడువులోగా అనుమానమే..

2021–22 రబీకి సంబంధించి ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టింది. ఈ మేరకు రైతుల నుంచి సేకరించిన 90 వేలకుపైగా మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం జిల్లాలోని 32 రైస్‌మిల్లులకు కేటా యించింది. ధాన్యం కేటాయించిన ఆరునెలల్లో మి ల్లింగ్ చేసి బియ్యం అప్పగించాల్సి ఉండగా, కాస్త ఆలస్యంగా మిల్లింగ్‌కు అనుమతులు రావడంతో మిల్లింగ్ కూడా ఆలస్యంగానే ప్రారంభమైంది. ఇప్పటివరకు 23.25 శాతమే మిల్లింగ్ పూర్తయింది. ఈనెల 31వరకు అధికారులు గడువు విధించగా, గడువులోపు పూర్తికావడం అనుమానమే అనిపిస్తోంది.

ధాన్యం పక్కదారి

కొందరు రైస్‌మిల్లర్లు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. గతనెలలో భైంసా డివిజన్‌లోని ఎడ్‌బిడ్‌లో ఓ రైస్‌మిల్లులో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టగా అక్రమంగా బియ్యం అన్‌లోడ్ చేస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇలా జిల్లావ్యాప్తంగా చాలామంది మిల్లర్లు గోదాముల్లో నిల్వ చేసిన ధాన్యాన్ని లారీల్లో ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగించాల్సి ఉండగా, దళారుల ద్వారా రేషన్‌బియ్యం కొనుగోలు చేస్తూ వాటినే పాలిష్ చేసి తిరిగి ఎఫ్‌సీఐకి అప్పగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులకు తెలియదా? అన్నది సందేహమే.

మిల్లింగ్‌లో తీవ్ర జాప్యం

గత రబీకి సంబంధించి జిల్లాలో 32 రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయించగా, కొందరు మిల్లర్లు సీఎంఆర్‌లో తీవ్ర జాప్యం చేస్తున్నారు. లోకేశ్వరం మండలంలోని ఓ రైస్‌మిల్‌కు 4,873 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా, 3,314 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది. కాగా, ఇప్పటివరకు 57.710 మెట్రిక్ టన్నులు మాత్రమే మిల్లింగ్ చేశారు. అలాగే దేగాం రోడ్డులోని మరో మిల్లుకు 8,814 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా, 5,905 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాలి. కానీ, 259 మెట్రిక్ టన్నులే అప్పగించారు. ఇలా ఈ రెండే కాదు.. దాదాపు 25 మిల్లుల్లో కనీసం 30 శాతం కూడా మిల్లింగ్ పూర్తి చేయలేదు. ఈ నెలాఖరు వరకు గడువు కాగా, ఎలా పూర్తి చేస్తారనేది సంబంధిత అధికారులకే తెలియాలి.

గడువులోపు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం

2021–22 రబీకి సంబంధించి సీఎంఆర్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. జనవరి 31లోగా ప్రక్రియ పూర్తి చేయాలని మిల్లర్లను ఆదేశించాం. గడువులోపు పూర్తి చేయని మిల్లర్లకు జరిమానా విధిస్తాం. అక్రమాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటాం.

– తనూజ, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి, నిర్మల్

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ ముషరఫ్ ఫారూఖి



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ముషరఫ్ ఫారూఖి సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఆయన గ్రామీణాభివృద్ధి, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం, నూతన కలెక్టరెట్ రోడ్డు పనులపై అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడేతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని వివిధ గ్రామాలు, పట్టణాల్లో చేపట్టిన పారిశుధ్య పనులు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాల సమాచారాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పనులను నిర్లక్ష్యం చేయవద్దని అధికారులకు సూచించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, అర్హులను గుర్తించి గ్రామసభ ఏర్పాటు చేయాలన్నారు. నూతన కలెక్టరేట్ రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. డీఆర్డీవో విజయలక్ష్మి, ఎంపీడీవోలు, ఆర్‌అండ్‌బీ అధికారులు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



మాట్లాడుతున్న నూతన్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం నూతన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాకూర్ తిరుపతి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికులు, రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు మూడు సంఘాల రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద హెల్త్ వెల్నెస్ సెంటర్లలో సేవలందించేందుకు మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ ఉద్యోగాల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ధనరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్ విద్యార్హత కలిగి ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత, బీఏఎంఎస్ విద్యార్హత కలిగిన వారికి రెండో ప్రాధాన్యత, బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం విద్యార్హత కలిగిన వారికి మూడో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఈ నెల 5నుంచి 7వరకు అందించాలని తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులు 2020 విద్యాసంవత్సరం నుంచి పట్టభద్రులై ఉండాలని, 2020 కంటే ముందు పట్టభద్రులైన బీఎస్సీ నర్సింగ్, ఆరు నెలల బ్రిడ్జి కోర్సు ఇగ్నో యూనివర్సిటీ నుంచి పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. జీఎన్‌ఎం చేసిన అభ్యర్థులు ఆరు నెలల బ్రిడ్జి కోర్సు ఇగ్నో యూనివర్సిటీ నుంచి పూర్తి చేసి ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు nirmal.telangana.govt.in ను సంప్రదించాలని సూచించారు.

జంగూబాయికి ఆత్రం వంశీయుల ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆత్రం వంశీయులు

దస్తురాబాద్: మండలంలోని భూత్కూర్ పంచాయతీ పరిధి రాంపూర్ గ్రామ శివారులోగల గోదావరి తీరంలో బుధవారం ఆత్రం వంశీయులు జంగూబాయి దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగాజలాన్ని తీసుకుని ఉట్నూర్ మండలం కల్లూర్‌గూడకు వెళ్లారు. రానున్న పుష్య మాసంలో నియమనిష్ఠలతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

హుండీ లెక్కింపు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట ఆలయ హుండీని ధర్మకర్తల పాలకమండలి ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. రూ.4,80,236 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌కు సన్మానం

పెంబి: జిల్లా కేంద్రంలో గాయత్రీ బ్యాంక్ ఎదుట మామడ మండలం కొరిటికల్ గ్రామానికి చెందిన గంగామణి తులంన్నర బంగారు గొలుసు పోగొట్టుకోగా.. పెంబి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసే మహ్మద్ రఫీకి దొరికింది. తనకు దొరికిన గొలుసును హెడ్‌కానిస్టేబుల్ మహ్మద్ రఫీ బాధిత మహిళకు అప్పగించాడు. విషయం తెలుసుకున్న పెంబి ఎస్సై రజినీకాంత్ హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ రఫీని పెంబి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం శాలువాతో సన్మానించి అభినందించారు.

పీహెచ్‌సీని సందర్శించిన కాయకల్ప బృందం



రికార్డులు పరిశీలిస్తున్న బృందం సభ్యులు

దస్తురాబాద్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం కాయకల్ప బృందం సభ్యులు సందర్శించారు. ఆస్పత్రిలోని ఆపరేషన్ గదులు, ఫార్మసీ స్టోర్‌ను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. రికార్డులు, ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో కాయకల్ప బృందం సభ్యులు నిర్మల్యరాయి, జాకీయ సయ్యద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, పీవో శ్రీనివాస్, డాక్టర్లు నాగరాజు, కామేశ్వర్, ఆరోగ్య విస్తరణాధికారి వేణుగోపాల్, లలిత, వైద్యసిబ్బంది రాజేందర్, ప్రసన్న, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం



లబ్ధిదారుకు చెక్కు ఇస్తున్న మంత్రి ఐకేరెడ్డి

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: ఆడబిడ్డలకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో పట్టణంతోపాటు వివిధ గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా బడుగు బలహీనవర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనుల పరిశీలన

జిల్లా కేంద్రంలోని ఈద్గమ్ నుంచి ఆదర్శనగర్, సిద్దాపూర్ మీదుగా కొట్ల(కే) వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ ముషారఫ్ ఫారూఖీ, అదనపు కలెక్టర్ హేమంత్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు రాము, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫేర్ సందర్శన

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఈదుగాం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి సైన్స్‌ఫేర్‌ను రాష్ట్ర మంత్రి ఐకే రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని ఆలోచన శక్తి, నైపుణ్యతను వెలికితీయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, ఎఫ్ఏసీఎస్ చైర్మన్ ధర్మాజీగారి రాజేందర్, కౌన్సిలర్ వాణి, ఏసీఎంవో రాథోడ్ శివాజీ, ప్రధానోపాధ్యాయుడు నాగబాబు పాల్గొన్నారు.

చండీహోమంలో ప్రత్యేకపూజలు

జిల్లా కేంద్రంలోని రాంనగర్ శ్రీపంచముఖ హనుమాన్ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా లలితాదేవీ చండీహోమం నిర్వహించారు. మంత్రి ఐకే రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

పన్నుల వసూలుకు స్పెషల్‌డ్రైవ్



'అటవీ' కార్యాలయంలో నోటీస్ ఇస్తున్న అధికారి

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో రూ.లక్షల్లో పేరుకుపోయిన పన్నుల వసూలుకు బుధవారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. కమిషనర్ రత్నాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పన్నులు చెల్లించాలని కోరారు. రూ.లక్షల్లో పన్నులు బకాయిలుండగా మున్సిపాలిటీకి ఆదాయం లేక తమకు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని కామాటీలు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం రూ.2.70లక్షలు, విద్యుత్‌శాఖ కార్యాలయం రూ.2.50లక్షలు, తహసీల్దార్ కార్యాలయం రూ.1.77లక్షలు, ప్రభుత్వ ఆస్పత్రి రూ.1.90లక్షలు, ఎంపీడీవో కార్యాలయం రూ.1.56లక్షలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. వీటితోపాటు ఇతర కార్యాలయాల్లోనూ రూ.లక్షల్లో పన్నులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు వెంటనే పన్నులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. గతంలోనే పలుసార్లు నోటీసులు ఇచ్చామని, తాజాగా మరోసారి నోటీసులు ఇస్తున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు రాజు, గణపతిరెడ్డి, సిబ్బంది భోజారావు, శంకర్, రమేశ్‌గౌడ్, నరేందర్, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అజేశ్‌కుమార్

సారంగపూర్: మహిళలు, యువతులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్ సూచించారు. మండలంలోని జామ్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు న్యాయపరమైన సమస్యలు, వాటిని అధిగమించేందుకు అనుసరించాల్సిన విధానాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలను గౌరవించే భారతదేశంలో వారిపై అనేక అఘాయిత్యాలు, అకృత్యాలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. మహిళలు తమనుతాము రక్షించుకునేందుకు చట్టంలో అనేక రకాల సంరక్షణ విభాగాల గురించి తెలుసుకోవాల్సిన అవసరముందని చెప్పారు. తప్పుచేసే ప్రతీ మగాడికి తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, న్యాయవాదులు రాజలింగం, మహేందర్, ప్రిన్సిపాల్ రమాకళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంధుల దినోత్సవం



అంధులకు మొబిలిటీ స్టిక్స్ ఇస్తున్న విజయలక్ష్మి

నిర్మల్‌చైన్‌గేట్: లూయిస్ బ్రెయిల్ జయంతి సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని మహిళాశిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయంలో అంధుల దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా సంక్షేమాధికారి విజయలక్ష్మి సాక్ష్యం సేవా సంస్థ ఆధ్వర్యంలో అంధులకు మొబిలిటీ స్టిక్స్ అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో నాగమణి, సూపర్‌వైజర్స్ దేవి, భాగ్యవతి, ప్రసూన, సావిత్రి, జ్యోతి, డీసీపీవో మురళి, ఎఫ్ఆర్వో మధుసూదన్, డీడబ్ల్యూవో సిబ్బంది శ్రీరామ్ మూర్తి, ఆజాజ్ హైమద్, సాగర్, సుదర్శన్, కవిత సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల పునరావాస కేంద్రంలో..

స్థానిక శాంతినికేతన్ దివ్యాంగుల పునరావాస కేంద్రంలో సమదృష్టి క్షమత వికాస్ అనుసంధాన్ మండల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మానసిక దివ్యాంగులకు అరటిపండ్లు పంపిణీ చేశారు. అనంతరం లూయిస్ బ్రెయిలీని కీర్తిస్తూ పాటలు పాడారు. కార్యక్రమంలో పంచబడి మహేశ్, నూకల విజయకుమార్, కత్రోజి అశోక్, శ్రీవాణి, సాయిప్రసాద్, రేఖ, వాసుదేవ్, ఉమ తదితరులు పాల్గొన్నారు.



- వివిధ కారణాలతో ఆత్మహత్యలు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

నిర్మల్: జిల్లాకేంద్రానికి చెందిన ఓ యువకుడికి తల్లిదండ్రులు, ఓ చెల్లెలు ఉన్నారు. నిర్మల్‌లోనే తండ్రికి మంచివ్యాపారం ఉంది. ఆర్థికంగా బాగానే ఉన్నారు. చిన్నకుటుంబం చింతలేకుండా సాగిపోతోంది. ఇంతలో ఒక్కరోజు తెల్లారేసరికి ఆ కుటుంబానికి ఊహించని ఘటన ఎదురైంది. ఎదిగిన ఒక్కగానొక్క కొడుకు ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఏమైందో ఏమోగానీ.. ఆ నవయువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగిల్చాడు. బెట్టింగ్‌లకు పాల్పడి చిన్నపాటి అప్పులు చేసినట్లు స్థానికులు చెప్పినా.. వారి ఆర్థిక పరిస్థితి ముందు అదేం పెద్ద సమస్య కాదు. తల్లిదండ్రులు మందలించకున్నా రెండో ఆలోచన చేయకుండా చావును ఎంచుకోవడం అందరినీ కలచివేసింది. ఇలా ఈ ఒక్క యువకుడే కాదు. ఈమధ్యకాలంలో చాలామంది బలవన్మరణాలకు పాల్పడుతుండడం కలవరపెడుతోంది. జిల్లాలో మంగళవారం ఒక్కరోజే ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు.

పెరుగుతున్న ఆత్మహత్యలు

ఈమధ్య చిన్నచిన్న సమస్యలకే జీవితాన్ని పణంగా పెడుతున్నారు. ప్రేమించిన అమ్మాయికి వేరొకరితో పెళ్లయినా తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నారు. తాగుడికి బానిసై అనారోగ్యం బారినపడి కోలుకోలేక 'ఇక నాబతుకెందుకు..' అంటూ ఈ లోకాన్ని వీడుతున్నారు. గంజాయి వంటి మత్తుపదార్థాల బారినపడి తమకు తెలియకుండానే ప్రాణాలు తీసుకుంటున్నారు. పేదరికం, సరైన ఉద్యోగం, ఉపాధి లేక, ఒంటరితనంతోనూ కొందరూ ఆత్మహత్య వైపు వెళ్తున్నారు. చివరికి తల్లిదండ్రులు మందలించిన కారణానికీ ప్రాణం తీసుకుంటున్నారు. మరికొందరి ఆత్మహత్యలకు సరైన కారణాలూ దొరకడం లేదు.


ఎందుకింత బలహీనత?

యువతరం అంటేనే సమాజానికి ఓ బలం. నవయువకులు అంటేనే బలమైన ఆలోచనలు, ఉడుకు రక్తానికి ప్రతీకలు. ఏ పనిలోనైనా గెలువాలన్న పట్టుదల, కసి కలిగి ఉండడం వారి సహజ లక్షణాలు. కానీ నేటితరంలో చాలామంది చిన్నవిషయాలకే కుంగిపోతున్నారు. తమలోని బలాన్ని గుర్తించకుండా బలహీనులుగా మారుతున్నారు. క్షణికావేశం, క్షణం కూడా ఆలోచించలేనితనంతో తమ బంగారు భవిష్యత్‌కు ఉరేస్తున్నారు. చిన్నవయసులోనే మద్యానికి, గంజాయి వంటి డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారు. వీటితోపాటు వివాహేతర సంబంధాలు, అసాంఘిక బంధాలు, వివిధ రకాల వ్యసనాలూ తోడవుతున్నాయి. ఇవన్నీ చిన్నవయసులోనే స్థాయికి మించి ఖర్చు పెట్టిస్తూ అప్పుల పాలు చేస్తున్నాయి. చేతిలో చిల్లిగవ్వ లేక, చేసిన అప్పులు కట్టలేక అవమానభారంతో చాలామంది ఆత్మహత్య చేసుకుంటున్నారు.

పలకరించేవాళ్లు లేక..

ఆత్మహత్యలు చేసుకుంటున్నవాళ్లలో 35–40 శాతం టీనేజర్లే ఉంటున్నారు. చదువు ముగిసే సమయంలో తమకంటూ ఓ ఉద్యోగం, ఉపాధి దొరకకపోవడం చాలామందిని కుంగదీస్తోంది. ఇలాంటి సయయాల్లో చాలాకుటుంబాలు అండగా ఉండకుండా వారిని హేళన చేసినట్లు మాట్లాడుతుండడం వారిలో ఒంటరితనాన్ని పెంచుతున్నాయి. తమ సమస్యను వినడానికి కూడా ఇంట్లోవాళ్లు కనీస సమయం ఇవ్వకపోవడం వారిని మానసిక ఒత్తిడికి గురిచేస్తోంది. అబ్బాయిలతోపాటు అమ్మాయిలూ ఇలాంటి ఒంటరితనం కారణంగానే ఆత్మహత్యల దాకా వెళ్తున్నారు.

సరైన కౌన్సెలింగ్ అవసరం



మత్తుపదార్థాలు, కుటుంబ, ఆర్థిక పరిస్థితులు, ఒంటరితనం ఇలాంటివే ఎక్కువగా యువతను ఆత్మహత్యల వైపు ప్రేరేపిస్తుంటాయి. ఇలాంటి సమస్యలున్న వారికి సకాలంలో సరైన కౌన్సెలింగ్ ఇస్తే మళ్లీ మామూలుగా మారుతారు. మానసికంగా ఇబ్బంది ఉంటే అందుబాటులో ఉన్న న్యూరో సైకియాట్రిస్ట్‌ను కలవాలి.

– ప్రొఫెసర్ డా.విశాల్, న్యూరోసైకియాట్రిస్ట్

ఇటీవలి కొన్ని ఘటనలు

- లక్ష్మణచాంద మండలం రాచాపూర్‌కు చెందిన ఎం.రమేశ్ (50) బుధవారం ఆర్మూర్ లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నాడు.
- లక్ష్మణచాంద మండలం వడ్యాల్‌కు చెందిన విశేశ్ (36) అనారోగ్యం, జీవితంపై విరక్తితో మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- మద్యానికి బానిసై ముధోల్ మండలకేంద్రానికి చెందిన గణేశ్ (19) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- బాసర గోదావరిలో దూకి ఎం.ప్రహ్లాద్ (24) ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- కుంటాల మండలకేంద్రానికే చెందిన మానస (21) గత నెల 2న అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుంది.
- కడెం మండలం నవాబ్‌పేటకు చెందిన ప్రసాద్ (23) గత నెల 22న పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు.
- కడెం మండలం అంబర్‌పేట్‌కు చెందిన లక్ష్మణ్ (32) గత అక్టోబర్ 9న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.
- కుంటాల మండలకేంద్రానికి చెందిన నవీన్ (28) గత ఆగస్టు 15న ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్లు జైలు

నిర్మల్‌టౌన్‌: హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తికి నిర్మల్‌ జిల్లా న్యాయస్థానం ఐదేళ్లు జైలు శిక్ష, జరిమానా విధించింది. న్యాయస్థాన పోలీస్‌ లైజన్‌ అధికారి సక్రియ నాయక్‌ వివరాల ప్రకారం. జగిత్యాల జిల్లా మల్లాపూర్‌ గ్రామానికి చెందిన గైని పద్విరాజ్‌కు పెళ్లై నాలుగేళ్ల కూతురు ఉంది. అదే గ్రామానికి చెందిన ఎండీ ఆఫ్రిన్‌కు సాబీర్‌తో వివాహమైంది. ఈ క్రమంలో ఆఫ్రిన్‌కు పృద్విరాజ్‌తో పరిచయం ఏర్పడింది. ఆఫ్రిన్‌ భర్త తరుచుగా మద్యం తాగి వేధిస్తుండడంతో పృద్విరాజ్‌తో కలిసి జీవించేందుకు హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. అక్కడ కొన్నిరోజులు కలిసి జీవించిన అనంతరం ఖానాపూర్‌లోని శాంతినగర్‌కు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఆఫ్రిన్‌ భర్త సాబీర్‌ 2019లో పృద్విరాజ్‌పై కత్తితో దాడి చేశాడు. గాయపడిన పృద్విరాజ్‌తో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న అప్పటి ఎస్సై ప్రసాద్‌ విచారణ చేపట్టారు. కోర్టులో నేరం రుజువు కావడంతో సాబీర్‌కు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ అసిస్టెంట్‌ సెషన్స్‌ జడ్జి కె.అజేశ్‌కుమార్‌ తీర్పునిచ్చారు.

పేకాట స్థావరంపై దాడి

లోకేశ్వరం: మండలంలోని బాగాపూర్‌ గ్రామ శివారులో బుధవారం పేకాటస్థావరంపై దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. పేకాటాడుతున్న ఆరుగురు వ్యక్తుల వద్ద నుంచి రూ.3550 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా పేకాటాడినట్లు తెలిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

లక్ష్మణచాంద: అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రాచాపూర్‌ గ్రామంలో చోటుచేసుకుంది. మాలెపు రమేష్‌(50) ఈ నెల 2న ఇంటి నుంచి నిర్మల్‌ వెళ్తున్నట్లు చెప్పాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. బుధవారం నిజామాబాద్‌ జిల్లా ఆర్మూర్‌లోని మమత లాడ్జిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడేళ్ల క్రితం రూ.12లక్షల అప్పులు కాగా ఎకరం భూమి అమ్మి అప్పులు తీర్చాడు. మళ్లీ రూ.8 లక్షల అప్పులు కావడంతో తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఆర్మూర్‌ ఎస్సై రాము తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్‌ పట్టణంలోని సీసీఐ పరిశ్రమ ఆవరణలో బుధవారం గుర్తు తెలియని శవం లభ్యమైంది. ఈ విషయంపై స్థానికులు వన్‌టౌన్‌ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. శవం పూర్తిగా కుళ్లిపోవడంతో అక్కడే ఖననం చేశారు. శవం మహిళాదా, పురుషుడిదా నిర్ధారించలేదు. వారం, పది రోజు ల క్రితం చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. వన్‌ టౌన్‌ ఎస్సై హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టు ఆవరణలో గొడవ.. కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్‌: జిల్లా కోర్టు ఆవరణలో మహారాష్ట్రలోని యావత్మాల్‌ జిల్లా ఘటంజి తాలుకా శరత్‌ గ్రామానికి చెందిన సావాపూరే దీక్షిత్‌తో పాటు నలుగురు, మరో మహిళ సావాపూరే అనిత కోర్టు ఆవరణలో బుధవారం గొడవపడ్డారు. కుటుంబ తగదాలతో ఇప్పటికే నడుస్తున్న కేసు విచారణ నిమిత్తం హాజరైన వారు కోర్టు ప్రాంగణంలోనే గొడవకు దిగారు. ప్రజాశాంతికి భంగం వాటిల్లడంతో టుటౌన్‌ హెడ్‌కానిస్టేబుల్‌ కిషన్‌ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై విఠల్‌ తెలిపారు.

- ఈ నెల 21న ప్రారంభం కానున్న నాగోబా జాతర
- బస చేసే చోటా ప్రత్యేక పూజలు
- గంగజలాలతో రాత్రి పగలు కాలినడక
- పాదయాత్రలో ఏడు గనెల మగబొంగు సేకరణ
- అడుగడుగునా సంప్రదాయ పద్ధతులు



రూరి దేవతకు మొక్కుతున్న నర్సపూర్‌ గ్రామస్తులు

పాదయాత్రతో ముందుకు సాగుతున్న మెస్రం వంశీయులు



నాగోబాను స్మరిస్తూ.. పవిత్ర గంగజలాలకు

ఉట్నూర్‌/ఇంద్రవెల్లి: అడవి ఒడిలో నాగోబా జాతర సంబురం ప్రారంభమైంది. నెలవంక దర్శనంతో నాగోబా జాతరకు శ్రీకారం చుట్టిన మెస్రం వంశీయులు సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా తమ ఆరాధ్యదైవాన్ని కొలిసేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 21వ తేదీ పుష్యమి అమవాస్య అర్ధరాత్రి పవిత్ర గంగజలాలతో నాగోబాను అభిషేకించి జాతరను ప్రారంభించనున్నారు. మెస్రం వంశీయులు పాదయాత్రగా జన్నారం మండలంలోని కలమడుగు సరిహద్దున గల గోదావరిలోని అత్తలమడుగు నుంచి పవిత్ర గంగజలాలు తీసుకురావడం అతి కీలకమైన ఘట్టం.

పాదయాత్రగా..

నాగోబాను అభిషేకించేందుకు పవిత్ర గంగజాలల కోసం ఈ నెల 1వ తేదీన కలశం పూజ అనంతరం పాదయాత్ర చేపట్టిన మెస్రం వంశీయులు ఈసారి తొమ్మిది ముఖాలు కలిసేలా గూడాలను ఎంపిక చేశారు. తిరుగు ప్రయాణంలో రెండు ముఖాలను ఉట్నూర్‌, దోడంద గ్రామాలను ఎంపిక చేశారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఇంద్రాయి వద్దకు ఈ నెల 17న చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి కేస్లాపూర్‌లోని నాగోబా అలయం సమీపంలోని వడమర వద్ద ప్రత్యేక గంగజలాలను మొదుగ చెట్టుపై భద్రపరుస్తారు. పుష్యమి అమవాస్య అర్ధరాత్రి గంగజలాలతో నాగోబాను అభిషేకించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈసారి కేస్లాపూర్‌ నుంచి 143 మంది యాత్రగా బయలుదేరగా ముఖం (బస) చేసిన చోటా నుంచి పాదయాత్రలో కలిసే వారితో సంఖ్య పెరుగుతుంది.

నెలవంక దర్శనంతో...

పుష్యమాసం నెలవంక దర్శనంతో మెస్రం వంశీయులు నాగోబా జాతరకు శ్రీకారం చుట్టారు. నెలవంక దర్శనం కావడంతో ప్రదాన్‌, కటోడలు ప్రచార యాత్రను మెస్రం వంశీయులు నివసిస్తున్న గూడాల నుంచి కొనసాగించారు. మొదట సిరికొండ మండల కేంద్రంలో కుండల తయారీకి... అక్కడి నుంచి గుడిహత్నూర్‌ మండలం షోయంగూడ మీదుగా ఇంద్రవెల్లి మండలం గిన్నెర అక్కడి నుంచి ఉట్నూర్‌ మండలం సాలెవాడ నుంచి ఇంద్రవెల్లి మండలం వాడ్‌గాం మీదుగా కేస్లాపూర్‌కు గత నెల 31న చేరుకుని ప్రచార యాత్ర ముగించారు.

అడుగడుగునా పవిత్రత...

గంగజలాల కోసం పాదయాత్ర నిర్వహించే మెస్రం వంశీయులకు బస చేసే గూడాలు ముందే నిర్ణయిస్తారు. అక్కడి రాగానే స్థానికులు కలశంకు ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ క్రమంలో గాది నిర్వహించడం కీలక ఘట్టంగా చెబుతారు. ఈ యాత్ర మధ్యలో అడవిలో మగ జాతికి చెందిన ఏడు గనెలు ఉన్న బొంగును సేకరిస్తారు. గత ఏడాది సేకరించిన బొంగును అత్తల మడగు గోదావరిలో వదిలివెసి కొత్తగా సేకరించిన బొంగుకు గంగజలాలు ఉన్న కలశానికి కట్టుకుని తీసుకువస్తారు. ఇలా ప్రతి ఏటా బొంగును మార్చుతుంటారు.



ఆడపడుచులు, అల్లులకు బుందో(కానుకలు) వేస్తున్న మెస్రం వంశీయులు

45 రోజుల పాటు....

నాగోబా జాతర పుష్యమాసం నెలవంక దర్శనం నాటి నుంచి ఉట్నూర్‌ మండలంలోని శ్యాంపూర్‌లో కొలువైన బుడుందెవ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 45రోజుల పాటు ప్రదాన్‌, కటోడాలు అత్యంత నియమనిష్ఠలతో ముందుకు సాగుతుంటారు. ప్రచార యాత్ర ముగిసిన వెంటనే గంగజల యాత్రను ముందుండి నడిపిస్తారు. గంగజల యాత్రకు బయలుదెరిన సమయంలో అత్తలమడుగు వరకు పాదయాత్రలో మొదటి వ్యక్తిగా ప్రదాన్‌ వ్యవహరించగా రెండో వ్యక్తిగా కటోడా ఉంటాడు.

తాత ముత్తాతల నుంచి యాత్ర..



తాతముత్తాతల కాలం నుంచి గంగజల యాత్రకు వస్తున్నాం. మా నాన్న మెస్రం లచ్చు ఐదు సంవత్సరాల క్రితం మరణించడంతో... అప్పటి నుండి నేను గంగజల యాత్రలో పాల్గొంటున్న. ఇంటి ఆచారాన్ని నా ముందు తరం కూడా పాటించే విధంగా చూస్తా.

మెస్రం దేవిదాస్‌, గుడిహత్నూర్‌ (మం) చింపుఘాట్‌ గ్రామం

పెద్దలు చూపిన మార్గంలోనే..



మెస్రం వంశీయులు నిర్ణయించిన మార్గం ప్రకారం యాత్రను కొనసాగించి పవిత్రమైన గంగజలాన్ని సేకరిస్తాం. యాత్ర చరిత్ర భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఎక్కువ మంది యువత వచ్చేలా నిర్ణయించి సంస్కృతి, సంప్రదాయాలను వారికి నేర్పిస్తున్నాం.

-మెస్రం దాదారావ్‌(ప్రధాన్‌ సమాజ్‌ పెద్ద)

నియమనిష్ఠలతో గంగజల యాత్ర



గంగజలయాత్ర అత్యంత నియమనిష్ఠలతో సాగిస్తాం. ఎంపిక చేసిన మార్గం దురాన్ని బట్టి ముఖంలు (బస చేసే ప్రాంతం) గుర్తించి బయలుదేరుతాం. మార్గంమధ్యలో కలిసే గూడాల్లో బస చేయకుండా కేవలం అల్పాహారం, తెనీరు లాంటివి స్వీకరించి ముందుకు సాగుతాం.

మెస్రం కోశు, కటోడా (మండలంగాదిగూడ, బోడ్డిగూడ గ్రామం)

సంస్కృతి, సంప్రదాయలను భావితరాలకు అందిస్తాం



తరతరాలుగా వస్తున్న నాగోబా చరిత్రతో పాటు గంగజల సేకరణ యాత్ర, సంస్కృతి, సంప్రదాయలను భావితరాలకు అందించడానికి కృషి చేస్తున్నాం. ప్రతి సంవత్సరం కేస్లాపూర్‌ నుండి ప్రారంభించే గంగజల యాత్రలో మెస్రం వంశం పెద్దలకు, యువతకు సలహాలు, సూ చనలు ఇస్తారు.

– మెస్రం కోశేరా(మెస్రం వంశ పెద్ద, సాలెవాడ ఉట్నూర్‌ మండలం)

నాకు ఊహ తెలిసినప్పటి నుంచి వెళ్తున్న..



నాకు ఊహ తెలిసిన నాటి నుంచి గంగజల యాత్రకు వెళ్తున్న. 2013లో మా తండ్రీ కాలం చేయడంతో నా తండ్రి బాధ్యతలను నాకు అప్పగించారు. దీంతో పెన్‌ కోత్వాల్‌ బాధ్యతలు నిర్వహిస్తున్నాను. పీఠాధిపతి ఆదేశాలను 22 కీతాలకు తెలియజేస్తాం.

– మెస్రం తిరుపతి (పెన్‌ కోత్వాల్‌, గుంజాల, నార్నూర్‌ మండలం)

లోకారి-బి నుంచి బయలు దేరిన మెస్రం వంశస్తులు

నార్నూర్‌: ఇంద్రవెల్లి మండలంలోని కెస్లాపూర్‌ నాగోబా ఆలయం నుంచి పవిత్ర జలం కోసం బయలు దేరిన మెస్రం వంశీయుల పాదయాత్ర మంగళవారం రాత్రి లోకారి -బి చేరుకుంది. రాత్రి అక్కడే బస చేసి గాదిగూడ మండలంలోని బోడ్డిగూడ గ్రామానికి బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బయలు దేరారు. అక్కడే బస చేసి గురువారం అదే మండలంలోని గణేశ్‌పూర్‌ చేరుకుంటారని దర్శకర్త మెస్రం శేఖర్‌ తెలిపారు.

10న తైబజార్‌ వేలం

ఇంద్రవెల్లి: ఈ నెల 21న మెస్రం వంశీయుల మహాపూజలతో ప్రారంభం కానున్న నాగోబా జాతర నిర్వహనలో భాగంగా ఈ నెల 10న తైబజర్‌ వేలం నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ ఈవో రాజమౌలి బుధవారం ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. వైలం పాటలో పాల్గొనే వారు ముందుగా... తైబజర్‌ కోసం రూ.50 వేలు, కొబ్బరికాయల అమ్ముకునేందుకు రూ.50 వేలు, వాహనల పార్కింగ్‌ కోసం రూ.20 వేలు, విద్యుత్‌ సరఫరా కోసం రూ.20 వేలు, ప్యాలాలు, పుట్నాలు అమ్ముకోవడానికి రూ.10 వేలు, కొబ్బరి ముక్కలు ప్రోగు చేసు కోనుటకు రూ.10 వేలు ముందుగా డిపాజిట్‌ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు పైన తెలిపిన దరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని ప్రకటనలో కోరారు.

బాసరలో కొనసాగుతున్న ఆందోళనలు

బాసర(ముధోల్‌): సరస్వతీ అమ్మవారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రెంజర్ల రాజేష్‌పై చర్యలు తీసుకోవాలని బాసరలో బుధవారం రెండవ రోజు ఆందోళనలు కొనసాగాయి. గ్రామంలోని వీధుల్లో పాఠశాలల విద్యార్థులు మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బాసరలోని వేదపాఠశాల విద్యార్థులు, నిజామాబాద్‌కు చెందిన లింగాయత్‌ సభ్యులు, అమ్మవారి ఆలయ ప్రధాన గోపురం వద్ద ధర్నా నిరహించారు. రెంజర్ల రాజేష్‌ను వెంటనే అరెస్ట్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. అనంతరం బాసర ఆలయంలో అన్యమతస్తులు పనిచేస్తున్నారని వారిని వెంటనే తొలగించాలని ఆలయ ఈవో విజయరామారావుకు వినతిపత్రం సమర్పించారు.

ఖందేవుడి మహాపూజ, జాతర పోస్టర్‌ ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తొడసం వంశస్తులు

నార్నూర్‌: మండల కేంద్రంలో ఈ నెల 6న నిర్వహించనున్న తొడసం వంశస్తుల ఆరాధ్యదైవం ఖందేవుడి మహాపూజ, జాతర కర పత్రాలను బుధవారం ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు తొడసం నాగోరావు మాట్లాడుతూ శుక్రవారం రాత్రి 9గంటలకు మహాపూజ, శనివారం ఉదయం 8గంటలకు తొడసం వంశానికి చెందిన ఆడపడుచూ నువ్వుల నూనే తాగే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం తొడసం వంశస్తుల భేటి ఉంటుందని వివరించారు. మధ్యాహ్నం దర్బార్‌ నిర్వహించనున్నట్లు చెప్పారు. దర్బార్‌కు ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ చైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌ హాజరవుతున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహాపూజ, దర్బార్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మన్‌ అడే సురేశ్‌, ఆలయ కమిటీ చైర్మన్‌ మెస్రం రూప్‌దేవ్‌, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్‌, ఉప సర్పంచ్‌ చౌహాన్‌ మహేందర్‌, అన్నా భావుసాఠె కమిటీ అధ్యక్షుడు కొర్రెళ్ల మహేందర్‌ ఉన్నారు.

సైన్స్‌ఫేర్‌ ద్వారా విద్యార్థుల నైపుణ్యం వెలికితీత

- ఐటీడీఏ పీవో కర్నాటి వరుణ్‌రెడ్డి



సైన్స్‌ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న పీవో కర్నాటి వరుణ్‌రెడ్డి

బజార్‌హత్నూర్‌: సైన్స్‌ఫేర్‌ ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయానికి ఈ ప్రదర్శనలు దోహదపడతాయని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని జాతర్ల గ్రామంలో మోడల్‌ స్పోర్ట్స్‌ స్కూల్‌లో బోథ్‌ డివిజన్‌ స్థాయిలో 14 గిరిజన ఆశ్రమ పాఠశాలలకు చెందిన 80మంది విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్‌ ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ భావితరాలకు ఉపయోగపడేలా వినూత్న ఆలోచనలతో వారిని మరింత ముందుకు వెళ్లేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ చైర్మన్‌ కనక లక్కెరావ్‌, డీడీటీడబ్ల్యూ డాక్టర్‌ ఎం.దిలీప్‌కుమార్‌, ఏటీఈవో సౌజన్య, జగన్‌, జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య, ఎంపీపీ అజాడే జయశ్రీ, వైస్‌ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్‌, ఎంపీటీసీ ఈశ్వర్‌, సర్పంచ్‌ లక్ష్మీనాగోరావ్‌, మడవి కృష్ణరావ్‌, శ్రీనివాస్‌, సంతోష్‌, కేవల్‌సింగ్‌ ఉన్నారు.

సెల్‌ఫోన్‌తో విద్యుత్‌ బిల్లుల రీడింగ్‌

- కొత్త సాంకేతికత వైపు విద్యుత్‌ శాఖ



వినియోగదారుడికి బిల్లును అందిస్తున్న సిబ్బంది

కుంటాల : మారుతున్న సాంకేతికను విద్యుత్‌శాఖ వినియోగిస్తోంది. ఆన్‌లైన్‌ పేమెంట్‌, యాప్‌తో పాటు సెల్‌ఫోన్‌ యాప్‌ ద్వారా విద్యుత్‌బిల్లుల రీడింగులు తీసే కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. సిబ్బంది వినియోగించే ఫోన్‌తో మీటర్‌ రీడింగ్‌ తీయడం ద్వారా సిబ్బంది యూజర్‌ ఐడీతో పాటు ప్రత్యేకంగా పాస్‌వర్డ్‌ రూపొందించారు. సెల్‌ఫోన్‌లో నమోదైన రీడింగ్‌ ప్రింట్‌ తీసి వినియోగదారులకు నేరుగా ఇస్తున్నారు. గతంలో సిబ్బంది ఇంటింటికి వెళ్లి మీటర్‌ రీడింగ్‌ పుస్తకంలో రాసుకొని వారం తరువాత వినియోగదారునికి బిల్లును ఇచ్చేవారు. ఇప్పుడు సెల్‌ఫోన్‌లో విద్యుత్‌సంస్థ సర్వర్‌కు నేరుగా కనెక్ట్‌ చేసి అప్లోడ్‌ అవ్వడం ద్వారా కొత్తవిధానం అమల్లోకి రావడంతో వినియోగదారులకు బిల్లల హెచ్చు తగ్గులు నమోదు కావడం, ఇతరాత్ర సమస్యలు తలెత్తవని అధికారులు చెబుతున్నారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్‌ పట్టణంలోని గడియార్‌మహల్‌కు చెందిన మహ్మద్‌ షబ్బీర్‌ ఇచ్చోడలో గాజుల వ్యాపారం చేస్తున్నాడు. రోజులాగే బుధవారం వ్యాపార నిమిత్తం ఉదయం 10గంటలకు ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. అతడి భార్య ఉదయం 11గంటలకు ఫోన్‌ చేయగా బంద్‌గా చేసి ఉండడంతో ఆందోళనకు గురైన ఆమె కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేసింది. ఇచ్చోడకు వెళ్లి షాపులో చూడగా తాళం వేసి ఉంది. చుట్టు పక్కల వారిని ఆరా తీయగా షాపుకు రాలేదని తెలిపారు. దీంతో షబ్బీర్‌ సోదరుడు షమీర్‌ఖాన్‌ టూ టౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులకు సమస్యలు రాకుండా చూస్తాం

ఇంద్రవెల్లి: నాగోబా జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని కేస్లాపూర్‌ నాగోబా ఆలయ పరిసర ప్రాంతంలో ఏర్పాటు పనులను పరిశీలించారు.శాశ్వతంగా ఉన్న మరుగుదొడ్లను మర్మత్తులు చేయడంతో పాటు భక్తులకు సరిపడా తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు నాగోబా ఆలయ పరిసర ప్రాంతంలో బోరు బావుల మరమ్మత్తులు చేయడంతో పాటు మిషన్‌ భగీరథ నీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. జాతర ముగింపు వరకు అధికారుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్‌ డీఈ శ్రీనివాస్‌, జేఈ భానుదాస్‌, సర్పంచ్‌ మెస్రం రేణుకనాగ్‌నాథ్‌ ఉన్నారు.

'ప్రజాసమస్యలపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం'

ఖానాపూర్‌: ప్రజా సమస్యల పరిష్కారంలో కేసీఆర్‌ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మాజీ ఎంపీ రాథోడ్‌ రమేష్‌ అన్నారు. ప్రజాగోస.. బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శివాజీనగర్‌, శాంతినగర్‌, విద్యానగర్‌, కూరగాయల మార్కెట్‌ తదితర చోట్ల పర్యటించారు. పేరుకే నియోజకవర్గ కేంద్రమైన పట్టణంలో ఏ గడపకు వెళ్లినా ప్రజాసమస్యలే దర్శనమిస్తున్నాయన్నారు. నాయకులు శ్రీరాంనాయక్‌, నాయిని సంతోష్‌, ఆకుల శ్రీనివాస్‌, తోకల బుచ్చన్న, మల్లయ్య, రవీందర్‌రెడ్డి, సుధాకర్‌, మోహన్‌, ఆనంద్‌, మహేందర్‌, కిషన్‌, లింగన్న, ఉపెందర్‌, శ్రావణ్‌, అనిల్‌రావు, రంజిత్‌, శివ ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగికి ఎక్స్‌ట్రా మైల్‌ పురస్కారం



సజ్జనార్‌ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అహ్మద్‌

ఆదిలాబాద్‌: ఆదిలాబాద్‌ ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్‌ డిపో క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న ఎంటీ అహ్మద్‌ ఎక్స్‌ట్రామైల్‌ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఎండీ సజ్జనార్‌ అవార్డును అందజేశారు. గత నవంబర్‌లో మహారాష్ట్రలోని కోర్పణకు చెందిన లక్ష్మి (4) ఆదిలాబాద్‌ బస్టాండ్‌లో తప్పిపోగా అహ్మద్‌ ఉన్నతాధికారులకు సమాచారం అందించి బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించాడు. ఆయన సామాజిక బాధ్యతను ప్రశంసిస్తూ ఈ పురస్కారం అందజేశారు. ఆర్టీసీ ఆర్‌ఎం జానీరెడ్డి, డిపో మేనేజర్‌ కల్పన అభినందించారు.

డిగ్రీ పరీక్షలకు 50శాతం విద్యార్థులు గైర్హాజరు

- పరీక్ష కేంద్రాలు దూరంగా ఉండడంతోనే..
- కేంద్రాలను తనిఖీలు చేసిన స్క్వాడ్‌ బృందం
- యూనివర్శిటీ అధికారులపై విద్యార్థుల ఆగ్రహం



బస్సులో విద్యార్థులను తరలిస్తున్న ప్రైవేటు కాలేజీ

బోథ్‌: డిగ్రీ పరీక్ష కేంద్రాలను దూరంగా ఏర్పాటు చేయడంతో చాలా మంది విద్యార్థులు బుధవారం జరిగిన ఐదవ సెమిస్టర్‌ పరీక్షలకు హాజరుకాలేకపోయారు. బుధవారం డిగ్రీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా దాదాపు 50శాతం మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. కేంద్రాలను దూర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన యూనివర్శిటీ అధికారుల నిర్ణయం విద్యార్థులకు శాపంగా మారింది. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. పరీక్షలు రాసేందుకు వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. ఉదయం 9 గంటలకు పరీక్షలు ప్రారంభం కాగా 8.30లకు పరీక్ష కేంద్రంలో ఉండాలి. అయితే గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేకపోయారు.

- నేరడిగొండ మండల కేంద్రంలోని సాయిచైతన్య డిగ్రీ కళాశాలలో 343 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 159 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. ఈ కేంద్రంలో బజార్‌హత్నూర్‌ మండలంలోని గిర్నూర్‌ గ్రామంలోని రాజరాజేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. గిర్నూర్‌ నుండి 23 కిలో మీటర్ల దూరంలో సెంటర్‌ ఉంది. బజార్‌హత్నూర్‌ మండలంలోని మారుమూల ప్రాంత విద్యార్థులు నేరడిగొండకు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. కాగా సదరు కళాశాల యాజమాన్యం బస్సులను ఏర్పాటు చేసి విద్యార్థులను నేరడిగొండ కేంద్రానికి తరలించినా 50శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేకపోయారు. ఇదే కళాశాలకు సంబంధించి బీకామ్‌ విద్యార్థులు నేరడిగొండ మండలంలోని త్రిదేవి డి గ్రీ కళాశాలలో పరీక్ష రాస్తున్నారు. 129 మంది విద్యార్థులకు కేవలం 66 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. 60 మంది గైర్హాజరయ్యారు.
- బోథ్‌లోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో 169 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 87మంది విద్యార్థులు హాజరుకాగా 82 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు.

ఆరుగురు డిబార్‌...

ఇచ్చోడ మండల కేంద్రంలోని నాలుగు డిగ్రీ పరీక్ష కేంద్రాల్లో ఆరుగురు మాల్‌ప్రాక్టీస్‌ పాల్పడగా వారిని స్క్వాడ్‌ బృందం డిబార్‌ చేశారు.

సీఎంఓ, కేటీఆర్‌లకు ట్వీట్‌..

పరీక్ష కేంద్రాలను ఇష్టానుసారంగా దూరంగా ఏర్పాటు చేశారని మంగళవారం సాక్షిలో వచ్చిన కథనాలను పలువురు విద్యార్థులు ముఖ్యమంత్రి కార్యాలయానికి, మంత్రి కేటీఆర్‌కు ట్వీట్‌ చేశారు. బేల మండలంలో ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో డిగ్రీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లే విద్యార్థులకు ఆయా మండల కేంద్రాల్లోనే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని విన్నవించారు.

ప్రారంభమైన డిగ్రీ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్‌: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష జరిగింది. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా వ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 3, 5వ సెమిస్టర్‌ పరీక్షలకు సంబంధించి 38,674 మంది పరీక్షలు రాయనున్నట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్‌ కంట్రోలర్‌ నరేందర్‌ తెలిపారు. మొదటి రోజు ఆదిలాబాద్‌ జిల్లాలో ఆరుగురు మాస్‌ కాపీయింగ్‌కు పాల్పడుతూ డిబార్‌ అయ్యారు. ఇచ్చోడలోని ఛత్రపతి కళాశాలలో ఒకరు, వివేకానంద కళాశాలలో ఐదుగురిని ఆదిలాబాద్‌ స్పెషల్‌ స్క్వాడ్‌లు డిబార్‌ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

దూరభారంతో రాలేకపోతున్నారు



ఇష్టానుసారంగా డిగ్రీ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏకంగా 20 నుండి 40 కిలో మీటర్లు విద్యార్థులు ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో మారుమూల ప్రాంతాల్లోని చాలా మంది గిరిజన, ఆదివాసీ విద్యార్థులు పరీక్ష హాజరుకాలేదు. పరీక్ష కేంద్రాలను ఆయా మండల కేంద్రాల్లోనే ఇతర కళాశాలల్లో ఏర్పాటు చేయాలి.

– ఆకాష్‌, ఏబీవీపీ నాయకులు

కమ్ముకున్న మంచు దుప్పటి



తాంసి, భీంపూర్‌ మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం మంచు దుప్పటి కప్పేసింది. చలిగాలులు వీచడంతో పాటు వాతావరణం సైతం చల్లబడింది. ఆయా గ్రామాలలో ఉదయం 11 గంటల వరకు దట్టంగా పంట చేన్లతో పాటు గ్రామాలలో పొగమంచుతో వాహనదారులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో వాతావరణంలో మార్పులతో చిరుజల్లులు కూడా కురిశాయి. పలువురు ప్రకృతి ప్రేమికులు మంచు దుప్పటి కప్పేసిన దృశ్యాలను చూస్తూ మురిసిపోయారు.

– తాంసి